కలిమి-కల్లోలం

యామినీ సరస్వతి

ఆరోజు తనకు వచ్చిన ఉత్తరమూ దాని వెంట జతపరచిన ఫిక్సెడ్ డిపాజిట్ రసీదు, తదితర హంగామా అంతా చూసే సరికి శేషఫణికి తల తిరిగి పోయింది. తను చదివిందీ చూస్తున్నదీ కలా! కల్లా? అనిపించింది.

ఒళ్ళు గిల్లుకున్నాడు. చురుక్కుమంది. కళ్ళు నులుముకున్నాడు. సందేహంలేదు తను జాగ్రదవస్థలోనే ఉన్నాడు. కంటి ఎదురుగా కనిపిస్తున్నది భూతద్దం కాదు. మాయా దర్పణమూ కాదు! ఉత్తరం!

ఛ! ఛ! ఇది ఉత్తరం కాదు. వరం! క్షేమ సమాచారాలు, సుఖ సంతోషాలు తెచ్చేవి మామూలు ఉత్తరాలు. ఇది జీవితాన్ని మార్చేస్తున్న లేఖ దీన్ని.పటం కట్టించి పూజించాలి. ఇంతకీ ఈ ఉత్తరం రాసిన బామ్మగారు ఎక్కడో గ్రూపు ఫోటోలో ఉన్నానంటూ వ్రాసింది. తనీ నలభయ్యేళ్ళ జీవితంలోనూ ఆవిడని

కానీ ఆవిడ ఫోటోకాని చూసిన పాపాన (పుణ్యానికి) పోలేదు.

"కైవల్యా! మీ అమ్మని యిలా పిలు."

ఆలోచనల నుంచి తేరుకుని తన పెద్ద కూతుర్ని కేకేశాడతను. బి ఏ. తప్పి పెరుగుతోన్న వయస్సుకి అడ్డంగా మూడుముళ్ళు వేయించుకోలేక, ఉక్కిరి బిక్కిరి చేసే ఆలోచనలతో మనస్సుని క్షణక్షణమూ తరిమే కోరికల్ని రేకొత్తే కథల నుండీ సినిమాలనుండీ రక్షించుకోలేక మధ్య యింటి గడపనానుకుని ఆ వారం వీక్లీ చదువుతోన్న కైవల్యకి తండ్రి పిలుపు కర్ణకఠోరంగా వినిపించింది.

"ఈ నాన్న ఎప్పుడూ యింతే! బాగా చదువుకునే వేళలో కేకేస్తాడు." అనుకుని పుస్తకం మూసి లేచి పెరట్లోకి వెళ్ళింది. పెరటి గోడ నానుకుని పక్కవాటా మీనాక్షమ్మగారితో బాతాఖానీ వేస్తున్న తల్లిని పిలిపించింది.

"వస్తున్నా పదవే!" అంది ఆమె తలయినా తిప్పకుండా.

"అర్జెంటుగా రమ్మన్నారు నాన్నగారు,"

"వస్తానొదినా! మళ్ళీ మాట్లాడదాం" అని ఇటు తిరిగి "వెధవ సంత, క్షణం కూడా కూర్చోనివ్వరు! ఏమిటంట అంత కొంపలంటుకపోయే కబురు" అని సణుగుతూ వస్తున్న భార్యని చూసి "కొంప లంటుకునిపోయే కబురుకాదు అనుపమా, కొంప వెలిగిపోయే కబురు" అన్నాడు శేషఫణి.

ముఖం చిట్లించి "మన బ్రతుక్కి అంత అదృష్టమా?" అందామె.

"ఇదిగో ఈ ఫోటో చూశావా! మన పెళ్ళయిన తర్వాత పడగ్గదిలోంచి సామాన్ల గదిలో అటకెక్కి కూర్చుంది? ఈ ఫోటోలో వున్న వాళ్ళెంత మంది పదహారు? ఈ కూర్చున్న వరుసలో నాలుగో వ్యక్తి మా నాన్నగారు! ఆయన ప్రక్కన్నే వున్నావిడ మా నానమ్మ! ఆ పక్కనుండే పూజ్యురాలు. ఆవిడకి దండం పెట్టుకో ముందు తర్వాత యీ ఫోటోని ఎన్‌లార్జిచేసి పడక గదిలో వుంచుకుని రోజూ పడుకోబోయే ముందూ-నిదురించే ముందూ దండం పెట్టుకోవాలి విధిగా మనం."

"మీ ఊకదంపుడు వదల్రు కదా ఇంతకీ విషయమేమిటోఅఘోరించండి."

"మీ ఆడవాళ్ళంతా యింతే! ముందు ఆవేశమేగాని ఆలోచన శూన్యం. ప్రతి దేవుడు చెప్పిన మాటకయినా పాతిక పరీక్షలు చేసిగానీ నమ్మరు. ఇదిగో ఈ ఉత్తరం చదువు" అని అందించాడు

ఆమె కాస్త బిగ్గరగానే చదివింది. "చిరంజీవి శేషఫణికి ఐశ్వర్యాభివృద్ధి రస్తుగా దీవించి మీ బామ్మగారు వ్రాయునది. ఈ బామ్మ ఎవరో అనుకుని కొత్తగా వెలిసిందనీ ఆశ్చర్య పోవద్దు.

నేనూ మీ నానమ్మా ఒకరకంగా తోటి కోడళ్ళం మీ నాన్న నాన్న ఆ యింటికి దత్తు వెళ్ళకముందు మేమంతా కలిసే వుండేవాళ్ళం, తర్వాత పూళ్ళూ, మన సులు దూరంకావటంతో దూరంగా వుండిపోయాం. మీ నాన్న పెళ్ళిఫోటో చూడు. మీ నానమ్మ పక్కనున్న ఫోటో లోని వ్యక్తిని నేనే ఇప్పుడు అసలు విషయమేమిటంటే మా వంశంలో ఒక్క మగ నలుసయినా మిగల్లేదు. అంతా కాలగర్భంలో కలిసిపోయారు. పూర్వీ కుల ముందు చూపు వల్ల కోలెడంత ఆస్తి మిగిలింది. ఎవరెవరికి ఇవ్వాలా అనే ఆలోచనల్లో అడ్డగాడిదవు నీవు గుర్తొచ్చావు. తినదగ్గవాడివని మా ఆయన వేసిన ఫిక్సెడ్ డిపాజిట్ అర వై వేలూ నీకిస్తూన్నాను దీనికి ఈ కాలంలో ఎంత వృద్ధి అయిందో కూడా తెలీదు. అవసాన కాలంలో ఓ మంచి పని చేద్దా మని లాయర్ని పిలిచి తగిన వాళ్లకి తగినట్టుగా ఆస్తి పంచాను. ఇవన్నీ లాయరుగారితో సంప్రదించే చేశాను. ఇట్లు ఈశ్వరాశీర్వాదాలతో మీ బామ్మ గుండాయమ్మ.

ఏకబిగిన చదివిన అనుపమకు కళ్లు తిరిగినట్లయింది.

"ఇంకో ఉత్తరం కూడా చదువు"

అది లాయర్‌గారు వ్రాసింది. ఆ బామ్మగారు చనిపోయి పదిహేను రోజు లైందనీ, ఆవిడ కోరిక మేరకు పని చేస్తున్న తను చెక్కు పంపుతున్నాననీ రాశాడాయన. చెక్కు చూసింది. లక్షా యిరవై వేలు!

తూలి పడబోయిందామె.

"ఆగాగు! జారిపడబోయే రోజులు ముందున్నాయ్. జరిగితే జరుపుకో. జారితే పడు అన్నారు పెద్దలు. పద! పద! మైల స్నానాలు చేద్దాం" అన్నాడు.

* * *

ఊరంతా ఆ వార్త దావానలంలా వ్యాపించింది.

నిన్న మొన్నటివరకూ కలెక్టరా ఫీసులో హెడ్‌క్లర్క్‌గా ఏడుస్తూ బొటాబొటిగా సంసారం నడుపుకునే శేషఫణి తెల్లారేసరికల్లా లక్షాధికారి అయ్యాడంటే అంతా అసూయపడ్డారు. టౌన్లో కాపురముంటే ఇళ్ళ అద్దెలు ఎక్కువ అనీ, పాలు పెరుగూ ఖర్చు భరించలేననీ సినిమాలూ గట్రా చూడ టము ఎక్కువవుతుందనీ టౌన్‌కి నాలుగు మైళ్ళ దూరంలోవున్న ఆ ఊళ్ళో వుండి సిటీబస్సులో తిరుగుతూ వుంటాడు అతను. పిల్లలు ఇంకా హైస్కూలుస్టేజి దాటలేదు. కాలేజీ వెలిగించిన అమ్మాయి ఎలాగూ తప్పింది. యింట్లోనే వుంటోంది.

అంత పిసినిగొట్టుకి నిత్య దరిద్రుడికి ఐశ్వర్యమా అనుకున్నా రంతా.

మరుసటిరోజు ఆఫీసుకి వెళ్ళేసరికల్లా అంతా అభినందించేవాళ్ళే.

"వెధవది! నేను ప్రతి లాటరీ టిక్కెట్టూ నెల నెలా కొంటూంటాను ఫస్ట్ ప్రయిజ్ కాకుండే మానే దాని కటూ యిటూగా ఒన్న నంబరయినా దొరకదు. గురువుగారు అదృష్టవంతులు. కానీ ఖర్చులేకుండా లక్షాధికారి అయ్యారు" అన్నాడు అతని తోటి సర్వీసు వుండీ యింకా యు.డి.సి. గ వుంటూన్న రమణమూర్తి.

"ఓయ్! అశ్వద్ధ ప్రదక్షిణలు చేసి కడుపుపట్టి చూసుకుండే అవుతుందా! అదృష్టం అలా కలిసి రావాలి. ఆడద యినా అదృష్టమయినా అనుకోకుండానే లభ్యమవుతారట!" ఇంకో గుమాస్తా వ్యాఖ్యానం.

అంతలో తహసీల్‌దారు భద్రగిరి వచ్చాడు.

"హార్ధీ కంగ్రాచ్యులేషన్స్!..." అన్నాడతను పైకి నవ్వుతోన్నా లోపల మంటగానే ఉందతనికి.

"థాంక్స్" అన్నాడు శేషఫణి.

"అందరికీ పార్టీ ఇవ్వాలి" అన్నాడాయన. "ఇలాగయినా కొంత ఖర్చు పనీ" అనుకున్నాడు మనస్సులో.

అందరూ బలపరచారు.

క్షణాలపై ఏర్పాట్లు జరిగాయి. డబ్బు యింకా చేతికి రాలేదు. జీతం రాళ్ళు మొన్ననే అయిపోయాయి. కుయ్యో మొర్రో అంటున్నా వినకుండా రెండొందలు అప్పిచ్చి తెప్పించాడు భద్రగిరి. నోరు మెదపలేదు శేషఫణి.

చూస్తూ వుండగానే రెండు నోట్లు కరిగి తినుబండారాల రూపంలో కలెక్టరాఫీసుని. అలరించాయ్. అభినందనగా కలెక్టరుగారు కూడా మాటాడేరు. తర్వాత ఆర్. డి వో. "ఇక శేషఫణిగారు! రిటైరయిపోవడం మంచిది. ఇది ఎలాగూ ఎమర్జెన్సీ పీరియడ్! ఏ రోజు ముప్పు ఎవరి నెత్తిపై పడుతుందోఏమో ముందుగానే తప్పుకుండే మంచిది. పైగా వున్నవాడూ లేనివాడూ వుద్యోగానికి తలపడితేనే ఉద్యోగాలు దొరకటంలేదు డబ్బున్న వాళ్లంతా ఉద్యోగం మానేస్తే నిరుద్యోగ సమస్య మూడొంతులు తీరుతుంది" అన్నాడు.

"ఆయన ఇంకో సంవత్సరంలో రిటైర్ అవుతాడు. ఎన్నో కేసులు ఎంక్వయిరీలో వున్నాయి. అయన ఈ సలహా ఇస్తున్నాడు'' అనుకున్నాడు. శేషఫణి.

తర్వాత ఒక్కొక్కరే "వ్యాపారం ప్రారంభించమనీ, కలెక్టరాఫీసు వాళ్లకై కో-ఆపరేటివ్ స్టోర్స్ ప్రారంభించమనీ, సిటీ బస్సులో ఎందుకు తిరుగుతావ్ స్కూటర్ కొనమనీ, స్కూటర్ ప్రమాదకరమనీ ఓ మధ్యరకం జీపు కొనమనీ ఇదంతా దుబారా ఎందుకు ఎక్కడయిన పొలాలు కొనమనీ, లాభంలేదు వ్యవసాయం స్వయంగా చేయిస్తేనే అంతంత

మా[త్రం గిట్టేది కవులు కిస్తే నాలుగణాల వడ్డీ రాదనీ, వడ్డీ వ్యాపారం చేయమనీ, సినిమాల్లో షేర్లు కొనమనీ, డిస్ట్రిబ్యూషన్ తీసుకోమనీ, ఏదయినా థియేటరు లీజుకు తీసుకోమనీ" ఇలా రకరకాలుగ సలహా ఇచ్చారు.

"వద్దురా భగవంతుడా! ఈ డబ్బు రాకున్నా మానె వీళ్ళ ఈర్ష్యలూ, అసూయలూ చూస్తూవుంటే బస్‌స్టాండులో నుంచొని వచ్చిపోయేవాళ్ళకి తలా పది రూపాయలు దానం చేసి తిరిగి ఒక్క రోజులో మామూలు మనిషినయిపోతే హాయి," అనుకున్నాడతను.

ఇక ఆ రోజు ఆఫీసులో పని సాగలేదు పర్మిషన్ తీసుకుని వెళ్ళి స్టేట్ బ్యాంకులో సేవింగ్స్ ఖాతాకి జమచేయించమని యిచ్చేడు.

నెల నెలా పది రూపాయలు ఆదా చేయటం తప్ప ఎరగని యీ గుమాస్తా గాడు లక్షా ఇరవయివేలు వేసేస్తున్నాడే, యిదేమయినా మిష్టరీనా అన్నట్టు చూశాడు ఏజంటు! ఫార్మాలిటీస్ అన్నీ ముగించుకుని తిరుగుముఖం పట్టాడు. శేషఫణి.

రోజూ వచ్చే వాడయినా అంతా వింతగా చూసేరు బస్సులో. "ఇంకా న్నాళ్ళే మీరు మా బస్సులో వచ్చే యోగం! మహారాజులు ఏదయినా టిప్ యివ్వండి కాఫీ గట్రా తాగుతాం" అన్న కండక్టర్‌కి హోటల్ బిల్లుపోగా మిగిలిన పదీ యిచ్చేశాడు శేషఫణి.

పదిహేను రోజులు గడిచాయి. ఈ రెండు వారాల్లో అక్షరాలా రెండు పదులు యిరవై వేలు డ్రా చేశాడు ఫణి. తప్పలేదు. ఇన్నేళ్ల సర్వీసులో బ్యాంక్‌లో నెల నెలా పదో పాతికో నిలవవేయటం తప్ప ఒక్కనాడూ డ్రా చేసి ఎరగడతను. పెచ్చువడ్డీ చక్రవడ్డీతో పెరుగుతూన్న అప్పులా పెరుగుతున్న కూతుర్ని చూసినపుడల్లా అతనికి బ్యాంక్ ఎకౌంట్ రాక్షసుడిగా ముందు సామాన్యుడిలా కనిపించేది. పెళ్ళికి యీ డబ్బేమవుతుంది అనుకునే వాడు. అలాటిది రెండు వారాల్లో యిరవై వేలు ఖాళీ అయేసరికి అతనికి తల తిరిగిపోయింది.

అయినా అదంతా అతనితో నిమిత్తం లేకుండా జరిగిపోయింది. ఎంత చెప్తూన్నా వినకుండా భార్య టౌన్‌కి మార్పించింది కాపురాన్ని, నెల నెలా రెండువందల పాతిక బాడుగ అంటే గుండె జల్లు మందతనికి. అది సామాన్యంగా కొందరి నెల జీతానికి ఎక్కువే! తన మటుక్కి తనకి జీతంలో సగానికి కాస్త తక్కువ అయినా భార్య విన్లేదు. సంవత్సరం అద్దె అడ్వాన్సుగా యిచ్చి పైన చిన్నరూం వేయించింది. ఎవరైనా వస్తే కూచుని మాటాడటానికి అనువుగా వుండాలని ముందుహాల్లో ఓ చిన్న అరగా గది కట్టించింది బాడుగలో జమ చేసుకునే పద్ధతి మీద. ఆ గదిలో సోఫా బెడ్, గాడ్రెజ్ చెయిర్స్, టేబిల్ ఫాన్,

రేడియో ఏర్పాటు చేసింది. పెళ్ళి కొత్తలో కొన్న రేడియో దానం చేసింది ఆఫీసు ప్యూన్ తిమ్మయ్యకి. పనులన్నీ ఫణితో నిమిత్తలేకుండా చేసేస్తుంది ఆమె.

షాపింగ్‌కి వెళ్ళి వచ్చిన రోజు అతనికి కళ్ళు తిరిగినై. ఆ చీరలూ అవీ చూస్తే ! డోర్ కర్టన్స్‌కి ఖర్చు చేసిన దాంతో ఓ సామాన్యుడి- ఈ డబ్బు రాక ముందు తమలాటి— యింట్లో పెళ్ళి బట్టలు వస్తాయి తేలిగ్గా. అతనికి తెచ్చిన గుడ్డలు చూసి, మూర్ఛపోయాడు. స్టైచ్ లాన్ పాంటింగ్ క్లాత్, జపాన్‌శిల్క్ షర్టింగ్, టెరికాట్ పంచాలూ, ఖద్దరు సిల్కు కోటింగ్ చూసి అతనికి తల తిరిగిపోయింది. ఏమీ అనలేకపోయాడు. టైలర్‌కి మూడొందల యాభై కుట్టుకూలి యిచ్చిన రోజు అతని అవస్థ చెప్పతరం కాదు.

"అమ్మా ఏమిటిదంతా ?" అన్నాడు ఇంకేమీ అన్లేక.

''ఇదుగోండి ! యిక మీదేం సాగదు. ఈ డబ్బంతా యీ యింటి కోడలి ధర్మం. హక్కు నాది. ఇన్నేళ్ళ జీవితంలో నల్లపూసలకి తప్ప నోచుకోలేదు

చేనేత బట్ట తప్ప మరోటి ఎరుగను. బ్రతికి నన్నాళ్ళు బ్రతకను. హాయిగా గడిపేద్దాం. రేపు షాపింగ్‌కి వెళ్ళాలి పదివేలు పట్టండి!"

"అనూ! దీనితో ముప్ఫైవేలు అవుతుంది తెలుసా."

"అవనివ్వండి యింకా బోలెడుంటుంది" అంది. అంతలో బయట రిక్షా ఆగిన చప్పుడయింది. భార్యాభర్తల మధ్య నిశ్శబ్దం తాండవించింది రెండు క్షణాలతర్వాత హడావిడగ వచ్చాడు శివసుందరం!

అతను శేషఫణి అన్నగారు. ఎక్కడో బరంపురం బార్డర్స్‌లో వుంటున్నాడు. యిల్లరికానికి వెళ్ళిన తర్వాత అతను వీళ్లని చూడటం యిదే ప్రథమం.

"రా! అన్నయ్యా!" అని ఆహ్వానించాడు.

తెచ్చిన పళ్ళ బుట్టలూ పూలగుత్తులూ స్వీట్స్ అన్నీ మరదలి చేతికిచ్చేసి ఆమె యిచ్చిన బూస్ట్ కాఫీ తాగేసి విశ్రాంతిగా కూర్చున్నాడతను.

"ఒరేయ్ ఫణీ! చాలా అర్జంటు. నేను రేపు మధ్యాహ్నం విజయవాడ బస్సుకి వెళ్ళిపోవాలి"

"రాక రాక వచ్చారు ఓ వారమయినా వుండండి."

"వీల్లేదురా! ఆవలెల్లుండి పదింటికల్లా డిపాజిట్ కడితేనే కంట్రాంక్టు దక్కుతుంది. లేకపోతే ఓ నెల్లాళ్ళు వుండాలనే వుంది. అయినా కైవల్య పెళ్ళికి ఎలాగూ రావాలి కదా?" అన్నాడు.

"నీ యిష్టం అన్నయ్యా" అన్నాడు ఫణి.

"ఫణీ!" అతని గొంతులో ఏదో సందిగ్గత.

"ఏమిటన్నయ్యా?"

"నాకో పాతిక వేలు కావాలిరా! మళ్ళీ కాంట్రాక్టు డబ్బు రాగానే యిచ్చేస్తాను"

"............"

"ప్రామిసరీ నోటు కూడా వ్రాసిస్తాను. అన్నయినా తమ్ముడయినా డబ్బు దబ్బే! స్నేహాలు చెడేదీ బంధుత్వం సడలేదీ డబ్బుతోనే. ఎంత మూడు నెలలు కళ్ళు మూసుకుంటే తిరిగి యిచ్చేస్తాను."

"............"

"తోడబుట్టిన వాడివనీ — అదీ అడిగితే లేదనకుండా యివ్వటానికి డబ్బుందనీ అడుగుతున్నాను. ఇప్పుడు నేను డబ్బు కట్టలేకపోతే లక్ష రూపాయలు మునిగిపోతాయి."

"............"

"ఫణీ! ఇన్నేళ్లూ నేను నిన్ను అనుకోలేదు. నిజమే! ఈ రోజు గుండాయమ్మ లాగా డబ్బు యిచ్చిందనే వచ్చాను. కాదన్ను కానీ నీవు యిప్పుడవన్నీ మనసులో పెట్టుకుని కాదంటే మా కుటుంబమంతా గంగలో కలవాల్సిందే."

"అన్నయ్యా: అంత మాటెందుకు, తీసుకెళ్ళు. ఎలాగూ నేను రేపు బ్యాంకికి



చెబుతున్నాను. అలాగే డ్రాఫ్ట్ చేసి యిస్తాను."

"హమ్మయ్య! నన్ను గండం నించి గట్టెంకించి బ్రతికించావు. నీ రుణం యీ జన్మలో తీర్చుకోలేను."

* * *

అతన్ని సాగనంపి వచ్చాక కస్సుమని లేచింది అనుపమ. "అన్నయట అన్నయ్య! ఏనాడయినా ఎర్రని ఏగాని యిచ్చిన పాపాన పోయాడా! ఈ రోజు వచ్చి కల్లిబొల్లి కబుర్లు చెప్పగానే పాతికలక్ష యిచ్చారు. నీళ్లా నూలూ జాగర్త చెయ్యండి. అదేం వచ్చేదా చచ్చేదా? అయినా మీకు డబ్బంటే లక్ష్యం ఎందుకుంటుంది. కష్టపడిందా? సంపాదించిందా! ఎవరో పుణ్యాత్మురాలు చస్తూ ఈ బీద సంసారాన్ని గట్టున వెయ్యాలని పంపింది. అయినా మన వన్ని దరిద్రబుద్ధులయితే ఎలా గట్టెక్కుతాం! ఈ కొంప కంతే!"

"అనుపమా!"

"ఇదుగో నా మాట విని అక్కడెక్కడో కెనడీనగర్‌లో ప్లాట్స్ అమ్ముతున్నారట. రెండు ప్లాట్స్, కొనెయ్యండి. మిగతా డబ్బుతో బంగారం కొనెయ్యండి. చేతిలో ఓ పదివేలుంటే చాలు మన వద్ద యింకా యిలాగే నిలిస్తే చీమల్లా పెరుక్క తింటారు. చివరికి మన గతి అధోగతే అవుతుంది."

"అలాగే కానీ అనూ! నాకేం అవసరాలున్నాయ్! అమ్మాయి పెళ్ళి చేసి యీ యిద్దర్నీ చదివించితే చాలు."

"నా గతి ఏమయినా ఫరవాలేదన్న మాట! అందుకే ముందుగానే చెపుతున్నాను. మొన్న కొన్న పండెండు తులాల నగలూ నాకే! కైవల్యకి మళ్ళీ

కొనండి. ఓ అయిదువేలు ఫిక్స్డ్ డిపాజిట్ చేయండి నా పేర" అంది ఆమె.

అన్నిటికీ తలూపాడతను.

*   *   *

వారం తిరిగే సరికల్లా అయిదువేలు పెట్టి ప్లాట్స్ కొనేశాడు. భార్య పేర అయిదువేలు ఫిక్స్డ్ డిపాజిట్ చేశాడు. పాతికవేల రూపాయలకి బంగారం కొనేశాడు. 'ఇంక పాతికవేలు మాత్రమే' వుంది అన్నాడు భార్యతో.

ఆమె కళ్లల్లో నీళ్లు తిరిగాయి. "చూశారా! కుళ్లుబోతు లోకం! మనకి డబ్బొచ్చి సరిగ్గా నెల తిరగలేదు. అప్పుడే లక్షరూపాయలు అయిపోయాయి. అబ్బ! డబ్బుండటం కూడా జబ్బేనండీ! ఎంత హైరానా! ఎంత హైరానా! ఇది రాకముందే హాయిగా వున్నామేమో! ప్రతివాళ్లూ బదులడగటమే! ప్రతి వ్యక్తి ఆశించడమే! ఊరికే ఎలా వస్తుందనుకున్నారో ఏమో! చందాలట! చందాలు: ఈ నెలలో అయిదారు వందలిచ్చారు చందాలు మీరు. ఖూనీచేసిన వాళ్లని కుక్కలు వాసన పడతాయట. డబ్బు చేరితే మనుషులు వాసన కొడతారు గాబోలు. ఎక్కడెక్కడి నుంచీ పరిగెత్తుకుని వచ్చి లాక్కెళతారు" అంది.

"అనూ! ఈ లోకం యింతే! డబ్బు చేరదా వాడిని దూరంగా వుంచుతారు డబ్బు చేరిందా వాడిని ఒంటిగా బ్రతకనివ్వరు వెంటాడి వేటాడతారు... ఈర్ష్య... ఈర్ష్య వుంది చూశావూ... అదెంతయినా చేయిస్తుంది. సర్వీసు పాతికేళ్ళు నిండిందని నన్ను రిటైర్ చేయించింది. ఆర్.డి.వో. గారడిగిన డబ్బు బదులివ్వలేదని చేసిన పని యిది. నాకేం పెద్దగా బాధగా లేదనుకో ఎలాగయినా యింకో అయిదారేళ్లకి రిటైర్ కావల్సిందే."

నిర్ఘాంతపోయింది అనుపమ

'డబ్బు సుఖాన్నే కాదు కష్టాన్ని కొని తెస్తుంది' అనుకుందామె.

"మనిషికి కావలసింది తినటానికి కట్టటానికి అనుకుంటాం కానీ, అది చాలదు. చేసే వుద్యోగాలతో బ్రతికి హోదాతో సరితూగే స్టేటస్ కూడా కావాలి మనిషికి అందుకోసం పడరాని పాట్లు పడతాడు. మోసం చేసయినా డబ్బు చేసుకోవాలనుకుంటాడు. కానీ యివన్నీ ఒట్టి ఫార్స్; ఎంత చెట్టుకి అంత గాలి తప్పదు! డబ్బొస్తే చాలు అనుకుంటాం కానీ దానితో వచ్చే బాధలు గుర్తించం. ఎన్ని కష్టాలయినా డబ్బుంటే చాలు గట్టెక్కొచ్చనుకుంటాం కానీ, డబ్బుతో వచ్చే కష్టాన్ని గట్టెక్కడానికి డబ్బు మాత్రం చాలదని తెలుసుకోవేం" అన్నాడు ఫణి.

జవాబు చెప్పలేదు అనుపమ ఆమె మనస్సల్లా యిక ముందు ఎలా అనే ఆలోచిస్తూ వుంది.